గోల్కొండ జగదాంబికా ఎల్లమ్మ ఆలయంలో మరమ్మతులు ప్రారంభం

ఆలయంలో రంగులు వేస్తున్న దృశ్యం

మెహిదీపట్నం, జూన్ 14 : తెలంగాణలో ఆషాఢమాసం బోనాలు సమీపిస్తుండటంతో అభివృద్ధిపనులు చేపట్టక పోవడంపై నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'గోల్కొండ బోనాలకు కనిపించని సన్నాహాలు' శీర్షికన 13-6-25న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దీంతో చారిత్రాత్మక గోల్కొండ కోటపై ఉన్న జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో దేవాదాయశాఖ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం ఆలయంలో రంగులు వేసే పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ వసంత ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఇంకా పది రోజుల సమయం ఉండడంతో ఆలయంలో, దాని పరిసరాలలో దేవాదాయ శాఖ అధికారులు పనులను చేస్తున్నారు. బోనాలను ఘనంగా నిర్వహించడానికి శాయ శకులా కృషి చేస్తానని ఈఓ వసంత చెప్పారు.

పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ ఇబ్రహీం బాగ్‌లో పోచమ్మ తల్లి ఆలయంలో శనివారం 6వ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పుణ్యాహవాచనం, గణపతి పూజ, నవగ్రహ మంటప ఆరాధన, శ్రీ లక్ష్మీ గణపతి నవగ్రహ హోమం, పూర్ణాహుతి, నవకలశ పంచామృత అభిషేకం తదితర పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ వినాయక దయానంద్, వైస్ చైర్మన్ పాండురంగం, నాయకులు వినాయక కుమార్, శ్రీనివాస, శ్రావణ్, వెంకటేశ్, కళాధర్, రాకేశ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూన్ 14

చిన్నారులకు అక్షరాభ్యాసం

చిక్కడపల్లి, జూన్ 14: జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన చిన్నారులకు శనివారం అమ్మ ఒడి, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పావని పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యతో పాటు ఆటలు, పాటలతో పాటు ప్రతిరోజూ పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. పౌష్టికాహారంలో నాణ్యత పాటించాలని అన్నారు.

స్వయం ఉపాధి రంగాలలో రాణించాలి

పటేల్ నగర్‌లో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూన్ 14: మహిళలు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని పురుషులతో సమానంగా రాణించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకులు హేమలత, లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ తదితరులతో కలసి ఆయన ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి రంగాలలో మహిళలకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

పేదలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూత

ఆపత్కాలంలో పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూత అందిస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం గోల్నాక క్యాంపు కార్యాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ పలు దవాఖానల్లో చికిత్స పొందిన 35 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.14లక్షల 90 వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రతి ఏటా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత నందిస్తున్నామని తెలిపారు.

గోల్నాక కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కార్మికుల శ్రేయస్సుకు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కృషి

నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న రైల్వే కార్మికులు, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సభ్యులు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 14 : రైల్వే కార్మికుల శ్రేయస్సు కోసం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఎల్లవేలా కృషి చేస్తుందని హైదరాబాద్ బ్రాంచి కార్యదర్శి వేగి మురళీకృష్ణ అన్నారు. నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని సీ అండ్ డబ్ల్యూ కార్యాలయం ఆవరణలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి, ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య జన్మదినం సందర్భంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులకు ఎల్లవేళలా తమ సంఘం అందుబాటులో ఉంటుందని అన్నారు. సంఘం సభ్యులు ఈఎన్ శ్రీనివాస్, ఏఎన్ ప్రసాద్, సి. శ్రీనివాసులు, వరప్రసాద్, మజార్, జ్యోతి, మణెమ్మ పాల్గొన్నారు.

22న మున్నూరు కాపు సంఘం సమావేశం

కాచిగూడ, జూన్ 14: రాష్ట్ర జనాభాలో 12 శాతం ఉన్న మున్నూరు కాపులను సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో చోటు కల్పించకుండా పక్కన పెట్టాడని, దీనికి కారణం మున్నూరు కాపుల్లో ఐక్యత లేకపోవడమేనని తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రేటర్ అధ్యక్షుడు మహేందర్ కుమార్, వెంకన్న పటేల్, డాక్టర్ విశాల్ పటేల్ తో కలిసి ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులను ఐక్యం చేయడానికి ఈనెల 22వ తేదీన సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ లో రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, గ్రామస్థాయి నేతలందరూ పాల్గొంటారని తెలిపారు. కొంతమంది రాజకీయ నేతలు తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాలను అనుకూలంగా వాడుకుంటూ వదిలేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశానికి తెలంగాణలోని మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

శ్రీనివాస కల్యాణానికి హాజరుకావాలని ఆహ్వానం

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అబిడ్స్, జూన్ 14 : ఆర్యవైశ్య సంఘం కార్వాన్ లో ఈనెల 21వ తేదీన నిర్వహించే శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పురాణాపూల్, కార్వాన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు శనివారం ఆహ్వానించారు. సంఘం నాయకులు మాడిశెట్టి సదానందం గుప్తా, యాద శ్రీనివాస్ గుప్తా, కిషోర్‌గుప్తా, జాలవాడి ధనుంజయ గుప్తాలు కవితను ఆమె నివాసంలో కలిసి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అంద జేశారు. ఈ నెల 21వ తేదీన ఆర్యవైశ్య సంఘం కార్వాన్‌లో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

సదస్సులు వైద్య విద్యార్థులకు దోహదపడతాయి



ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఫిస్టులాకాన్-2025 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్

సుల్తాన్ బజార్, జూన్ 14 : సదస్సులు వైద్య విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ అన్నారు. ఉస్మానియా జనరల్ సర్జరీ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పల్లం ప్రవీణ్ నేతృత్వంలో ఫిస్టులా కాన్-2025 లైవ్ ఆపరేటివ్ వర్క్‌షాప్ ఫిస్టులా ఇన్ ఏఎన్ఓ రెండు రోజుల సదస్సు శనివారం కోఠి లోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు ఈ సందర్భంగా సదస్సులో లైవ్ ఫిస్టులా సర్జరీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎం ఈ డాక్టర్ నరేంద్ర కుమార్ హాజరై రెండు రోజుల సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను 1989లో వైద్య విద్య పూర్తి చేసుకున్న తరుణంలో తన సుపీరియర్ ప్రాక్టికల్స్ నిర్వహించే క్రమంలో తొలిసారి ఫిస్టులాను తాకకుండా శస్త్ర చికిత్స చేయాలని సూచించారని గుర్తు చేసుకున్నారు. తన తొలి సర్జరీ కూడా ఫిస్టులా నేనని అన్నారు. డాక్టర్ పల్లం ప్రవీణ్ ఫిస్టులా నూతన ఒడివడికలను రూపొందించి పేపర్ ప్రజెంటేషన్ నిర్వహించి ఇంటర్నేషనల్ సర్జరీలో గుర్తింపు పొందడం గర్వకారణం అని అన్నారు. రెండు రోజుల సదస్సుకు వందలాది మంది వైద్య విద్యార్థులు హాజరు కావడం గొప్ప విషయం అన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్‌సహాయ్, సదస్సు ఛీఫ్ పాట్రన్ డాక్టర్ డి. మోహన్‌దాస్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పల్లం ప్రవీణ్, సదస్సు పత్రం డాక్టర్ బి. ఉమాకాంత్‌గౌడ్, డాక్టర్ మండల ఐలయ్య, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ డి రమేశ్, డాక్టర్ మోక్ష ప్రసూన, డాక్టర్ రంగా అజ్మీర, డాక్టర్ జీవన్ రావు, డాక్టర్ మత్తయ్య వర్గీస్, డాక్టర్ జగదీశ్వర్, లతో పాటు వివిధ శాఖల వైద్యులు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యోత్సవం

కూచిపూడి నృత్యప్రదర్శనలో పాల్గొన్న నృత్యకారిణులు

రవీంద్రభారతి,జూన్14 : సద్గురు శివానంద నృత్యమాల ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నృత్యోత్సవం-2025 పేరిటి సంప్రదాయ నృత్య ప్రదర్శన శనివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సద్గురు శివానంద నృత్యబాల కళాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సభకు ముందు బొంపల్లి సుధీర్‌రావు శిష్యులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాయాదవ్

కాచిగూడ, జూన్ 14: రాజకీయాలకు అతీతంగా డివిజన్ అభివృద్ధి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. డివిజన్ లోని రహమత్‌బాగ్, తదితర ప్రాంతాల్లో శనివారం పాదయాత్ర నిర్వహించి అక్కడి డ్రైనేజీ సమస్యలను తెలుసుకొని, పరిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్లోని డ్రైనేజీ సమస్యను తీర్చేందుకు రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ కనీస సదుపాయాలు కల్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, లావణ్య, సంతోష్, భీమ్రాజ్, రవియాదవ్, వాసు, సూరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

బన్సీలాల్‌పేట్, జూన్ 14 : రక్తదానం చేయడంవల్ల మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని, స్వచ్ఛందంగా రక్తదానం కోసం ముందుకు వచ్చిన దాతలు అభినందనీయులని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ రాజకుమారి అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీ దవాఖానలోని బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు.స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను, రిస్ట్ బ్యాండ్‌లను అందజేసి అభినందించారు. గాంధీ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ సరిత, ఆర్ఎంఓలు డాక్టర్ రజిని, డాక్టర్ నజీమ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శ్రవణ్‌కుమార్, ఫరీదుద్దీన్, దేవేందర్, సునీత, మన్సూర్, బాబా, ఖాజా, వెంకటేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకర్లకు సన్మానం

కాచిగూడ, జూన్ 14: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో నిర్వహించిన ఎఫ్ సెట్-2025లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులలో 100 మంది ఆర్యవైశ్య విద్యార్థులను బంగారు పథకాలతో జులై 6వ తేదీన లక్డికాపూల్ లోని వాసవి సేవ కేంద్రంలో సన్మానించనున్నట్లు అవోపా బ్యాంక్ మెన్ చాప్టర్ అధ్యక్షుడు పీవీ రమణయ్య, ముఖ్య సలహాదారుడు కె.రామానందం తెలిపారు. శనివారం కాచిగూడలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ, ఏపీ ఎఫ్ సెట్ ఫలితాలతో పాటు నీట్, జెఈఈ(అడ్వాన్సడ్) పరీక్షలు రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులను కూడా సన్మానించనున్నట్లు వారు తెలిపారు.https://forms.gle/eCkXjXkLT2pYZswR6 గూగుల్ లింకు ద్వారా విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 28 లోగా పంపాలని వారు కోరారు. వివరాలకు 944 1928528లో సంప్రదించాలి.

అజంతా రైల్లో దొంగతనం

కాచిగూడ, జూన్ 14 : అజంతారైల్లో దొంగతనం జరిగింది కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. బెంగళూరు ప్రాంతానికి చెందిన కాంచన్ సాంగ్వి(62) అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా గుర్తుతెలియని దుండగులు ఆమె బ్యాగును దొంగిలించారు. అందులో 8 గ్రాముల బంగారు చైన్, రూ. 15,000 ఉన్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీ .. మహిళకు తీవ్రగాయాలు

గోల్నాక, జూన్ 14: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ మహిళకు తీవ్ర గాయాలై ఘటన అంబర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్ స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్ అంబర్ పేట మల్లికార్జుననగర్ కు చెందిన జి.మహేందర్ భార్య జి.సుజాత ప్రైవేటు ఉద్యోగి. శుక్రవారం రాత్రి రెడ్ బిల్డింగ్ నుంచి మల్లికార్జుననగర్ కు నడుచుకుంటూ వెళ్తుండగా బాబురామ్ మోటార్ సర్కిల్ వద్ద అతి వేగంగా బైక్ (TS11ER6000)పై వచ్చిన వ్యక్తి సుజాతను వెనకనుంచి ఢీ కొట్టి వెళ్లిపోయాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలు కాగా... స్థానిక దవాఖానలో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి కుమారుడు మధు శ్రావణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి

గురువులను సత్కరిస్తున్న కోలేటి దామోదర్‌గుప్తా, కె. వెంకటరమణారావు

రవీంద్రభారతి, జూన్14: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ధూం ..ధాం తెలంగాణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథఫులుగా కోలేటి దామోదర్‌గుప్తా, నాట్యచార్య కాంతారావు, నా ట్యాచారిణి విజయలక్ష్మి, దైవజ్ఞశర్మ, మణి పూర్ణిమ, విష్ణుప్రియ శ్రీ కాంత్, జైకిసాన్..జైజవాన్, జైకళాకార్ వ్యవస్థాపకులు కె.వెంకటరమణారావు తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి పలువురు నాట్యగురువులకు,కళాకారులకు పురస్కారాలు, సర్టిఫికెట్లు బహుకరించారు. ఈ సమావేశంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు లలితా రావు, స్వాతి, జర్నలిస్టు జేఎల్ శ్రీనివాస్, అంజిమాస్టర్ పాల్గొన్నారు.

మోహన్‌రాజుకు విజయపల్లవీ సంగీత పురస్కారం

పురస్కారం బహూకరిస్తున్న ఆచార్య వెల్దండ నిత్యానందరావు

రవీంద్రభారతి, జూన్14 : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భీమన్న సాహితీ నిధి కళా నిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మహాకవి, కళాప్రపూర్ణ పద్మభూషణ్ డా.బోయి భీమన్న కుమార్తె విజయపల్లవి బోయి జయంతి సందర్భంగా శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ గాయకులు సంగీత నెలరాజు కీ.శే మోహన్‌రాజుకు విజయపల్లవీ సంగీత పురస్కారం ప్రకటించారు. ఈ సందర్భంగా మోహన్‌రాజు కుమారుడు కొండా మదన్ మోహన్ రాజుకు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెల్దండ నిత్యానందరావు, సాహితివేత్త డా.వోలేటి పార్వతీశం, భీమన్న సాహితీ అధ్యక్షురాలు హైమవతీ భీమన్న , డా.కోయి కోటేశ్వరరావు, డా.గురజాడ శోభాపేరిందేవి తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి విజయపలవీ సంగీత పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య వెల్దండ నిత్యానందరావు మాట్లాడుతూ.. విజయపల్లవి బోయి గొప్ప గాయాని, సితార్ విద్యాంసురాలని ఆమె జయంతి సందర్భంగా కిశే మోహన్‌రాజు కుమారుడు కొండా మదన్ మోహన్‌రాజు పురస్కారం బహూకరించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.పుష్పలత, కార్యదర్శి ఎ.సురేందర్, రచయిత హైమవతి భీమన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు

ఖాదర్‌బాగ్ వాసులతో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్

మెహిదీపట్నం, జూన్ 14 : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. శనివారం నానల్ నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్ ఎంఐఎం నాయకులు షబ్బీర్‌తో కలిసి స్థానికులు ఎమ్మెల్యేకు రోడ్ల సమస్యపై ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌నసీరుద్దీన్ పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత

చిక్కడపల్లి, జూన్ 14: ప్రకృతిని కాపాడుకోవటం మన అందరి బాధ్యతని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది శ్రీధర్ పోతరాజు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాలలో పర్యావరణ చట్టాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా శ్రీధర్ పోతరాజు హాజరై మాట్లాడారు. ప్రకృతి గురించి అందులో ఉండే సున్నితమైన విషయాల గురించి వివరిస్తూ ప్రస్తుతం మారుతున్న జీవనశైలితో పర్యావరణంలో జరుగుతున్న విపరీత పరిణామాలు, చట్టాల గురించి వివరించారు. భావి న్యాయవాదులు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క ళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బం ది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీధర్ పోతరాజు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కవాడిగూడ, జూన్ 14: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ), జనహిత ఫౌండేసన్, కిమ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పులతో వచ్చే వ్యాధులతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైన వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేటర్ వైద్య సంస్థలు సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు అందించే వైద్య సేవలను మురికివాడల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో దాదాపు 200 మందికి బీపీ, షుగర్, గైనిక్, ఆర్థోపెడిక్, కంటిపరీక్షలు, న్యూరో తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కోఆర్డినేటర్లు శివరాణి, ఇందిరాభారతి, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు ప్రవీణ్, కల్యాణ్, కృష్ణ, అజిపాషా, షకీల్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, సభ్యులు గోవిందర్‌రాజ్, గోపాల్, గంగాదేవి, నర్సింగరావు, రాములు, స్వరూ ప, పద్మ, తదితరులు పాల్గొన్నారు.